క్లుప్తంగా

పని చేసే వారికి పదవులు

– మాజీ డిప్యూటీ సీఎం అంజాద్ బాషా



నాగేంద్రారెడ్డిని సత్కరిస్తున్న అంజద్‌బాషా

కడప కార్పొరేషన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కోసం పనిచేసే వారికే పదవులు దక్కుతాయని మాజీ డిప్యూటీ సీఎం ఎస్‌బీ.అంజద్‌బాషా తెలిపారు. కడప వెస్ట్‌జోన్ అధ్యక్షుడిగా ఎంపికైన వి.నాగేంద్రారెడ్డి శుక్రవారం అంజద్ బాషాను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా అంజద్‌బాషా, తదితరులు నాగేంద్రరెడ్డిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పులి సునీల్ కుమార్. దాసరి శివప్రసాద్. దేవిరెడ్డి ఆదిత్య. పి.రామ్మోహన్‌రెడ్డి అజ్మతుల్లా. త్యాగరాజు. హరూన్ బాబు. సంజీవ రాయుడు. కంచుపాటి బాబు. శ్యామ్. రమేష్ పాల్గొన్నారు.

దౌర్జన్యాలు మానుకోవాలి



మాట్లాడుతున్న రవిశంకర్‌రెడ్డి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: కూటమి పాలకులు అక్రమాలు, దౌర్జన్యాలు మానుకోవాలని, ఇప్పటికైనా తమ పద్ధతులు మార్చుకోవాలని రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శి రవిశంకర్‌రెడ్డి హితవు పలికారు. నగరంలోని ఆర్‌సీపీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మొన్న మద్యం టెండర్లు, నేడు ఇసుక, గనులు, టెండర్లలోనూ వారి దౌర్జన్యాలు బయటపడ్డాయన్నారు. ప్రజలకు సేవలందిస్తారని అధికారాన్ని కట్టబెడితే వారి సొంత ప్రయోజనాలకు, ఆస్తులు కూడబెట్టుకోవడానికి ఉపయోగించుకుంటున్నారన్నారు. అధికారాన్ని ప్రజల అభివృద్ధి కోసం వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌సీపీ నగర కార్యదర్శివర్గ సభ్యులు మడగలం ప్రసాద్, రమేష్‌బాబు, విజయ్‌కుమార్, రవి, తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌జేడీకి సత్కారం



ఆర్‌జేడీని సత్కరిస్తున్న నాయకులు

కడప ఎడ్యుకేషన్: పాఠశాల విద్య రెగ్యులర్ ప్రాంతీయ సంచాలకులుగా బాధ్యతలు చేపట్టిన శామ్యూల్‌ను కడప జిల్లా రాష్ట్ర ఉపాధ్యాయ పండిత పరిషత్ నాయకులు శుక్రవారం శాలువాలతో సత్కరించారు. జిల్లా విద్యా శాఖ మంచి ఫలితాలను సాధించేలా కృషి చేయాలని ఆర్‌జేడీని కోరారు. ఎ.నరసింహారెడ్డి, నాగసురేష్, చిన్నబాబయ్య, బాల నరసింహులు, పెద్ద బాబయ్య పాల్గొన్నారు.

రూట కడప అర్బన్ కార్యవర్గం ఏర్పాటు



ఖాదర్‌బాషా

కడప ఎడ్యుకేషన్: రాష్ట్ర ఉర్దూ టీచర్స్ అసోసియేషన్ కడప అర్బన్ యూనిట్(రూట) అధ్యక్ష, కార్యదర్శులను కడపలో శుక్రవారం ఎన్నుకున్నారు. రూట కడప అర్బన్ యూనిట్ అధ్యక్షుడిగా నగరపాలక ఉర్దూ బాలుర ఉన్నత పాఠశాల ఆంగ్ల ఉపాధ్యాయులు ఖాదర్‌బాషా, కార్యదర్శిగా మహమ్మద్ నూరుల్లా, ఆర్థిక కార్యదర్శిగా అబ్దుల్ ముజీబ్‌లను ఎన్నుకున్నారు.

గుర్తింపు లేని పాఠశాలపై చర్యలు తీసుకోవాలి



ఏడీ మునీర్‌ఖాన్‌కు వినతిపత్రాన్ని సమర్పిస్తున్న జగదీష్, నాగరాజు

కడప ఎడ్యుకేషన్: జిల్లాలో గుర్తింపు లేని పాఠశాలలపై అధికారులు చర్యలు తీసుకోవాలని ఆల్ ఇండియా స్టూడెంట్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు జగదీష్, రాష్ట్ర కార్యదర్శి నాగరాజులు డిమాండ్ చేశారు. ఈ విషయమై శుక్రవారం డీఈఓ కార్యాలయ ఏడీ మునీర్‌ఖాన్‌ను వారు కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో చాలా పాఠశాలలు అక్రమ అడ్మిషన్లు నిర్వహిస్తున్నాయన్నారు. దీంతోపాటు వేలకు వేలు ఫీజులు రాబడుతున్నారన్నారు. అలాంటి వాటిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

29న టెంకాయలు విక్రయించుకునేందుకు వేలం

చింతకొమ్మదిన్నె: కొత్తపేట గంగమ్మ గుడి ఆవరణలో సంవత్సరం టెంకాయలు విక్రయించుకునేందుకు ఈ నెల 29వ తేదీ ఉదయం 11.00 గంటలకు వేలం నిర్వహించనున్నట్లు గంగమ్మ దేవస్థానం ఈవో రవిశేఖర్‌రెడ్డి తెలిపారు. టెండరుదారులు నిబంధనలు పాటించాలని ఆయన సూచించారు. వేలంపాటలో అధికారులకు సహకరించాలని కోరారు.

22న శ్రీరామ శోభాయాత్ర

- కడప నగరంలో భారీ ఏర్పాట్లు
- ఉదయం, సాయంత్రం వీధుల్లో ప్రచారం
- ఇంటింటా కరపత్రాల పంపిణీ



మున్సిపల్ మైదానంలో సీతారామ కల్యాణోత్సవానికి ఏర్పాట్లు



వైవీ స్ట్రీట్‌లో ప్రచారం నిర్వహిస్తున్న భక్తులు



శోభాయాత్రకు సిద్ధమైన శ్రీరాముడి విగ్రహం

కడప కల్చరల్: శ్రీరామ శోభాయాత్రకు నగరం సిద్ధమవుతోంది. అయోధ్యలో బాల రాముడి విగ్రహం ఏర్పాటుచేసి ఏడాది గడచిన సందర్భంగా నగరంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఇప్పటికే భారీ హోర్డింగ్‌లు, ఫ్లెక్సీబోర్డులతోపాటు ఓ మోస్తరు, చిన్న బ్యానర్లు, కాషాయ జెండాలతో నగర వీధులు కళకళలాడుతున్నాయి. ధార్మిక బృందాలు భజనలతో వీధుల్లో సాగుతూ ఇంటింటికీ వెళ్లి యాత్రకు రావాలని ఆహ్వానిస్తున్నారు. హౌసింగ్ బోర్డులోని కోదండ రామాలయం కేంద్రంగా ఇతర ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. చుట్టు ప్రక్కల దాదాపు 20 గ్రామాల నుంచి భక్తులు ఈ కార్యక్రమానికి వచ్చే అవకాశముందని నిర్వాహకులు చెబుతున్నారు. ఆ ప్రాంతాలలో ఆటోలతోపాటు ప్రత్యేకంగా రూపొందించిన శ్రీరామ యాత్ర రథం ద్వారా ప్రచారం కొనసాగుతోంది. కోలాటం బృందాలు, భజన బృందాలు నగరంలో ఆహ్వానం కోసం ప్రదర్శనలిస్తూ సాగుతున్నారు. ప్రచార సమయంలో ఆయా ప్రాంతాలన్నీ పండగ వాతావరణాన్ని తలపిస్తూ ఉత్సవంలా కనిపిస్తోంది.

ఉదయం నుంచి ప్రచారం

గత ఏడాది కంటే ఈసారి ఎక్కువ మంది భక్తులతో ఈ శోభాయాత్ర సాగాలనే ఆశయంతో నిర్వాహకులైన అయోధ్య ఐక్య వేదిక ప్రతినిధులు దేవాలయాల నిర్వహణ కమిటీ, భజన బృందాలు, భక్త మండళ్లను కూడగడుతున్నారు. ఈ నెల 22వ తేదీన ఉదయం 6 గంటల నుంచి కడప నగరంలోని మున్సిపల్ మైదానంలో యాత్రకు సంబంధించి సీతారాముల కల్యాణోత్సవం నిర్వహించేందుకు ఏర్పాట్లు ప్రారంభించారు. ఇప్పటికే వేదిక, భారీ ఆర్చి ఏర్పాటుచేశారు. భక్తుల సౌకర్యార్థం చలువ పందిళ్లు వేశారు. ఉదయం పది గంటల వరకు అన్ని సంప్రదాయ పూజల నిర్వహణ అనంతరం జిల్లా అర్చక సమాఖ్య ఆధ్వర్యంలో టీటీడీ ఆగమ శాస్త్ర పండితులు ప్రొఫెసర్ రాజేష్ భట్టర్ ఆధ్వర్యంలో స్థానిక వేద పండితులు విజయ్ భట్టర్ బృందం శాస్త్రోక్తంగా కల్యాణోత్సవాన్ని నిర్వహించనుంది. 10 గంటలకు వేదిక సమీపంలోనే అన్నప్రసాద వితరణ ఉంటుంది. అక్కడి నుంచే కడప నగరంలోని పలు ప్రధాన వీధుల ద్వారా దాదాపు 11 కిలోమీటర్ల మేర శోభాయాత్ర సాగనుంది. ప్రత్యేకంగా తయారు చేయించిన శ్రీరామ రథంపై శ్రీరామచంద్రుని విగ్రహాన్ని ఏర్పాటు చేయనున్నారు. రాష్ట్రం నలుమూలల నుంచి పేరుగాంచిన 11 కళాబృందాలను ఈ యాత్రకు ఆహ్వానించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రతి చిన్న, పెద్ద కూడళ్లలో స్వచ్ఛందంగా కొందరు భోజనం, అల్పాహారం, మంచినీరు, శీతల పానీయాలను అందించే ఏర్పాట్లు చేస్తున్నారు. అన్ని కూడళ్ల మీదుగా సాగే శోభాయాత్ర కడప నగరం హౌసింగ్‌బోర్డు కాలనీలోని శ్రీ కోదండ రామాలయం వద్ద ముగియనుంది.

ప్రజలకు అవగాహన కల్పించాలి



సూచనలిస్తున్న కమిషనర్ మనోజ్‌రెడ్డి

కడప సెవెన్‌రోడ్స్: కడప నగర ప్రజలకు పరిసరాల పరిశుభ్రతతోపాటు రోడ్లు, కాలువల్లో చెత్త వేయకుండా అవగాహన కల్పించాలని కడప నగర పాలక సంస్థ కమిషనర్ మనోజ్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. నగరంలోని కోటిరెడ్డి సర్కిల్, నాగరాజుపేట, కాగితాలపెంట, జిల్లా పరిషత్ అన్న క్యాంటీన్ పరిసర ప్రాంతాలలో శుక్రవారం ఆయన పర్యటించి అధికారులకు దిశా నిర్దేశం చేశారు. కోటిరెడ్డి సర్కిల్ మెయిన్ రోడ్‌లో స్వీపింగ్ చేస్తున్న వర్కర్లతో మాట్లాడి తెల్లవారుజామునే పనులు చేపట్టాలని సూచించారు. నారాయణ కాలేజీ వరకు మెయిన్ రోడ్డును పరిశీలించి తెల్లవారుజామున స్వీపింగ్ పనులతో కార్యక్రమం ప్రారంభించాలని ఆదేశించారు. తడి–పొడి చెత్త వేరు చేసే విధానాన్ని చురుకుగా అమలు చేయాలని, క్లాప్ ఆటో వ్యవస్థను పరిశీలించి, ప్రతి రోజూ డోర్ టు డోర్ చెత్త సేకరణ కొనసాగించాలని సూచించారు. డివిజన్ పరిధిలోని బ్రిడ్జిలను రెండు రోజులకోకసారి శుభ్రం చేసే చర్యలు చేపట్టాలన్నారు. కాగితాలపెంట డివిజన్‌లో రోడ్లపై చెత్త కనిపించడంతో వెంటనే శుభ్రం చేయాలని శానిటేషన్ సిబ్బందికి ఆదేశించారు. వర్కర్ల హాజరు పట్టీని పరిశీలించి, అనుమతి లేకుండా గైర్హాజరైన వారిపై చర్యలు తీసుకోవాలని సూచించారు. రోడ్డు ఆక్రమణల తొలగింపునకు సంబంధించిన వివరాలను టౌన్ ప్లానింగ్ విభాగం సమర్పించాలని పేర్కొన్నారు. అన్నాక్యాంటీన్‌లోని టాయిలెట్ల మరమ్మత్తుల అవసరంపై ఇంజినీరింగ్ శాఖకు తక్షణ చర్యలు చేపట్టమని సూచించారు.

ఆమోదయోగ్యంగా పాఠశాలల పునర్నిర్మాణ ప్రక్రియ

పాఠశాల విద్య ఆర్‌జేడీకి ఎస్టీయూ వినతి



క్యాలెండర్, డైరీ ఆవిష్కరిస్తున్న ఆర్‌జేడీ శ్యాముల్

కడప ఎడ్యుకేషన్: రాష్ట్రంలో 117 జీవో రద్దు తదనంతరం క్లస్టర్ పాఠశాలల ఏర్పాటు, మోడల్ ప్రైమరీ స్కూల్స్ ఎంపిక ద్వారా పాఠశాలల పునర్నిర్మాణ ప్రక్రియలో ఎలాంటి సమస్యలు ఉత్పన్నం కాకుండా చూడాలని ఎస్టీయూ నాయకులు కోరారు. ఆర్‌జేడీ శామ్యూల్‌ను ఆయన కార్యాలయంలో శుక్రవారం ఎస్టీయూ నాయకులు కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. వారు మాట్లాడుతూ అందరికీ ఆమోదయోగ్యమైన విధానంలో ఈ ప్రక్రియ ముగిసేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. కూటమి ప్రభుత్వం మూడు, నాలుగు, ఐదు తరగతులను ప్రాథమిక పాఠశాలలకు తెస్తూ ప్రతి గ్రామపంచాయతీలో ఒక మోడల్ ప్రైమరీ స్కూల్ ఏర్పాటుచేయాలనుకోవడాన్ని తాము ఆహ్వానిస్తున్నామన్నారు. ఒక్క పాఠశాల కూడా మూతపడకుండా పాఠశాలల పునర్నిర్మాణ ప్రక్రియ పూర్తిచేయాలని కోరారు. అలాగే ఉన్నత పాఠశాలలో మ్యాథ్స్, ఆంగ్లం సబ్జెక్టు ఉపాధ్యాయుల మిగులు ఏర్పడే పరిస్థితిని ఏ విధంగా అధిగమిస్తారో స్పష్టత ఇవ్వాలని కోరారు. విద్యార్థుల సిలబస్ మరింత సరళీకృతం చేయడం ద్వారా విద్యార్థుల్లో అభ్యసన స్థాయి తగ్గిపోయే ప్రమాదం ఉందన్నారు. ఆర్‌జేడీ శామ్యూల్ స్పందిస్తూ త్వరలో సంఘాలతో ఒక సమావేశాన్ని ఏర్పాటు చేసి అన్ని విషయాలపై చర్చించి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం ఎస్టీయూ నాయకులతో కలిసి సంఘ డైరీ, క్యాలెండర్లను ఆయన ఆవిష్కరించారు. ఈ సమావేశంలో ఎస్టీయూ నాయకులు సురేష్‌బాబు, బాలగంగిరెడ్డి, ఇలియాస్ బాషా, నరెడ్డి సంగమేశ్వర్‌రెడ్డి, చెన్నకేశవరెడ్డి, ప్రతాపరెడ్డి, మస్తాన్‌బాబా, చంద్రమోహన్‌రెడ్డి, తులసీధర్, ధర్మారెడ్డి, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

న్యాయ సేవలపై అవగాహన పెంచుకోవాలి



మాట్లాడుతున్న జడ్జి బాబా ఫకృద్దీన్

కడప అర్బన్: న్యాయసేవలపై అవగాహన పెంచుకోవాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ సెక్రటరీ, జడ్జి ఎస్.బాబాఫకృద్దీన్ అన్నారు. కడప జిల్లా న్యాయ సేవా సదన్‌లో నిర్వహించిన ఓరియెంటేషన్ ప్రోగ్రాంలో జడ్జి మాట్లాడుతూ జాతీయ న్యాయసేవాధికార సంస్థ బాలల సంరక్షణ కోసం అమలు చేస్తున్న స్నేహ పూర్వక న్యాయసేవల పథకం 2024, లీగల్ సర్వీసెస్ అథారిటీ యాక్ట్ 1987, స్పెషల్ జోనల్ పోలీస్ యూనిట్ సపోర్ట్ పర్సన్స్ గార్డియన్, వార్డ్ యాక్ట్, బాలల, కౌమార లేబర్ చట్టం 1986, బాలల హక్కుల పరిరక్షణ చట్టం 2005, పిల్లల నిషేధ వివాహ చట్టం 2006, బాల్య న్యాయచట్టం 2015, ఉచిత, నిర్బంధ విద్య కోసం పిల్లల హక్కు చట్టం, 2009 లైంగిక నేరాల నుంచి పిల్లల సంరక్షణ చట్టం 2012, పిల్లల కోసం జాతీయ విధానం 2013 మిషన్ వాత్సల్య పథకం 2022 మోడల్ పోస్టర్ కేర్ మార్గదర్శకాలు 2024 పథకాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో నాలుగో అదనపు జిల్లా న్యాయమూర్తి ఇన్‌ఛార్జి చైర్మెన్ గరికపాటి దీనబాబు, స్వర్ణ ప్రసాద్, బిఆర్.సుభాష్‌యాదవ్, పి.దౌలత్‌ఖాన్, న్యాయవాదులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

పీఆర్సీ అమలులో జాప్యం చేయడం తగదు



మాట్లాడుతున్న లక్ష్మీరాజా

కడప ఎడ్యుకేషన్: 2వ పీఆర్సీ అమలు విషయంలో కూటమి ప్రభుత్వం జాప్యం చేయడం తగదని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.లక్ష్మీరాజా, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయకుమార్, పాలెం మహేష్‌బాబు డిమాండ్ చేశారు. కడప యూటీఎఫ్ భవన్‌లో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఐదేళ్లకోసారి పేరివిజన్ అమలు చేయడంలో పాలక వర్గాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. అధికారంలోకి వస్తే ఉద్యోగ, ఉపాధ్యాయుల ప్రయోజనాలు నెరవేరుతాయని, ఉద్యోగుల ఆకాంక్షలకు అనుగుణంగా పాలన సాగుతుందని భావించి కూటమి ప్రభుత్వానికి పట్టం కట్టారన్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో నియమించిన పీఆర్సీ కమిషన్ చైర్మన్.డాక్టర్.మన్మోహన్ సింగ్, కమిషన్ బాధ్యతల నుంచి తప్పుకున్నప్పటికీ, నూతన కమిషన్ ఏర్పాటుచేయడంలో కూటమి ప్రభుత్వం వైఫల్యం చెందిందని ఆరోపించారు. పిఆర్సీ సకాలంలో అమలు కాకపోతే పదవీ విరమణ పొందే ఉద్యోగ, ఉపాధ్యాయుల ప్రయోజనాలు అందక తీవ్రంగా నష్టపోతారన్నారు. కె.నరసింహా రావు, ఎస్.ఎజాస్‌అహమ్మద్, ఎం.ప్రభాకర్, పి.చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి పోస్టు గ్రాడ్యుయేట్ పరీక్షతో ఉజ్వల భవిత



పోస్టర్లు విడుదల సైన్సు క్లబ్ ప్రతినిధులు

కడప ఎడ్యుకేషన్: దేశ వ్యాప్తంగా జరిపే సెంట్రల్ యూనివర్సిటీ ప్రవేశ పరీక్షలో ర్యాంకు సాధిస్తే ఉజ్వల భవిష్యత్తు కలుగుతుందని విజ్ఞాన భారతి ఏపీ ప్రాంత ఉప కార్యదర్శి డా.ఆదినారాయణరెడ్డి, సర్ సీవీరామన్ సైన్స్ క్లబ్ సలహాదారు డా.గునిశెట్టి శ్రీనివాసులు అన్నారు. కడప మున్సిపల్ హైస్కూల్ మెయిన్‌లో సీయూఈటీ పరీక్షలపై అవగాహనా పోస్టర్లను వుక్రవారం వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సెంట్రల్ యూనివర్సిటీలు, స్టేట్ యూనివర్సిటీలు, ప్రైవేటు డీమ్డ్ యూనివర్సిటీలలో పోస్ట్ గ్రాడ్యుయేట్ కోర్సుల ప్రవేశం కోసం జరిపే ఈ పరీక్షను అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రారంభమైందని, ఫిబ్రవరి 1వ తేదీ వరకు కొనసాగుతుందన్నారు. భారతీయ వ్యవసాయ పరిశోధనా మండలి (ఐకార్) అగ్రికల్చర్ కోర్సులలో ప్రవేశం కూడా ఈ ఉమ్మడి ప్రవేశ పరీక్షా ఫలితాల ఆధారంగా జరుగుతుందని పేర్కొన్నారు. ఈ నెల 20వ తేదీన సాయంత్రం వెబ్‌నార్ ద్వారా అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. వివరాలకు 9492378327 సెల్ నెంబర్‌లో సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాసులురెడ్డి, ప్రధాన కార్యదర్శి గంగాధర్, క్లబ్ సభ్యులు దామోదర్, శ్రీధరరావు, వెంకట్రామిరెడ్డి పాల్గొన్నారు.

12వ వేతన కమిషన్ ఏర్పాటుచేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న చంద్రశేఖర్

కడప ఎడ్యుకేషన్: ప్రభుత్వ ఉద్యోగులకు 12వ వేతన కమిషన్‌ను తక్షణమే ఏర్పాటు చేయాలని ఎస్టీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కడప జిల్లా కార్యాలయంలో జరిగిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం 8వ పే కమిషన్ ఏర్పాటు చేసే నిర్ణయం తీసుకున్నందున రాష్ట్ర ప్రభుత్వం కూడా 12వ పీఆర్సీ కమిషన్ ఏర్పాటుచేయాలని కోరారు. 2002 జూలై, 1 నుంచి 19 నెలలు ముగిసినా ఇంత వరకూ 12వ కమిషన్ ఏర్పాటు చేయకపోవడం సరైన విధానం కాదన్నారు. ఉపాధ్యాయులకు ఆర్థిక లబ్ధి చేకూర్చే సరెండర్ లీవ్, డీఏ అరియర్స్, పీఆర్సీ బకాయిలు వెంటనే చెల్లించాలని కోరారు. ఎస్టీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఆవుల శ్రీనివాసులు మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయులందరికీ పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఎస్టీఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

రైల్వే కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

కడప కోటిరెడ్డిసర్కిల్: రైల్వే కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎల్వీ.మోహన్‌రెడ్డి ఎం.రవికుమార్ కోరారు. కడప రైల్వే స్టేషన్‌లోని వారి కార్యాలయం వద్ద శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ ఇంజినీరింగ్ విభాగంలో అన్ని ఖాళీలను భర్తీ చేసి అదనపు పోస్టులు సృష్టించాలన్నారు. ఎల్‌డీసీఈ ద్వారా అన్ని డిపార్టుమెంట్లలో అవకాశం కల్పించాలని, గ్రూప్–డి రిక్రూట్‌మెంట్ అంతా ట్రాక్ మెయింటెన్స్ కేటగిరీ అయి ఉండాలన్నారు. ట్రాక్ మెయింటనర్లకు రోస్టర్ పాయింట్ల ద్వారా రెండు షిఫ్టులుగా డ్యూటీలు ఉండాలన్నారు. కీ మెన్లకు పనిభారం తగ్గించాలని, అన్ని పీ–వే యూనిట్లలో ట్రాక్ మెయింటెనర్లకు హట్స్ ఏర్పాటుచేయాలని కోరారు. శ్రీరామకృష్ణయ్య, ఎస్ఎం.అతావుల్లా, వెంకట సుబ్బయ్య, శంకర్, అనిల్, రాజేష్‌లు కోరారు.

ప్రతి పాఠశాలకు ప్రధానోపాధ్యాయుడిని నియమించాలి



ఆర్‌జేడీని సన్మానిస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

కడప ఎడ్యుకేషన్: ఉపాధ్యాయ, విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని ఏపీటీఎఫ్ రాష్ట ఉపాధ్యక్షుడు శ్యాంసుందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆర్జేడీగా బాధ్యతలు చేపట్టిన శామ్యూల్‌ను శుక్రవారం వారు కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్యాంసుందర్‌రెడ్డి మాట్లాడుతూ జీవో నెంబర్ 117ను రద్దు చేయడాన్ని స్వాగతిస్తున్నామని తెలిపారు. 3, 4, 5వ తరగతుల విద్యార్థులు ప్రాథమిక పాఠశాలలకు వస్తున్నందున 2023లో బదిలీ పొందిన ఉపాధ్యాయులకు తప్పనిసరిగా అవకాశం కల్పించాలన్నారు. విద్యార్థుల సంఖ్యతో నిమిత్తం లేకుండా ప్రతి ఉన్నత పాఠశాలలకు ప్రధానోపాధ్యాయుడు, వ్యాయమోపాధ్యాయుల పోస్టులు మంజూరుచేయాలన్నారు. అశోక్ కుమార్, ఖాదర్‌బాషా, శ్రీనివాసరెడ్డి, శ్రీనివాసులు, నరసింహులు, రామచంద్రారెడ్డి, క్రిష్టారెడ్డి, రామచంద్రారెడ్డి, శివయ్య, జాకీర్ హుస్సేన్ పాల్గొన్నారు.

శిథిలం.. ఎన్టీఆర్ ప్రాంగణం



శిథిలమవుతున్న ఎన్టీఆర్ ప్రాంగణం



పెచ్చులూడుతున్న పైకప్పు



రాళ్లు తొలగిపోయిన స్తంభం

1991లో ఏర్పాటు చేసిన నందమూరి తారక రామారావు మహిళా ప్రాంగణంగా పేరు పెట్టిన నాయకులు ఆ భవనం శిథిలమైనా పట్టించుకోవడం లేదు. మహిళల శిక్షణకు ఉపయోగపడిన ఈ నైపుణ్య అభివృద్ధి సంస్థ కార్యాలయం ప్రస్తుతం శిథిలమైందనేందుకు ఈ చిత్రాలే సాక్ష్యం. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే పునర్నిర్మాణం చేపడతామని హామీ ఇచ్చిన నేతలు మరచిపోయారు. ప్రస్తుతం ఓ అడవిని తలపించేలా ముళ్లపొదలు పెరిగాయి. ప్రహరీ పడిపోయింది. చెత్త పెరిగి దుర్గంధం వెదజల్లుతోంది.

– రఫీ, సాక్షి సీనియర్ ఫొటోగ్రాఫర్

సస్యరక్షణతో అధిక దిగుబడులు

కమలాపురం : రైతులు సాగు చేసిన పంట పొలాల్లో ఎరువుల యాజమాన్యం, సస్యరక్షణ చర్యలు చేపట్టాలని మండల ఏఓ సరస్వతి తెలిపారు. శుక్రవారం మండలంలోని పొడదుర్తి, లేటపల్లె గ్రామాలలో నిర్వహించిన పొలం పిలుస్తోంది.. కార్యక్రమంలో భాగంగా క్షేత్రస్థాయిలో వరి, వేరుశనగ పంట పొలాలను ఆమె పరిశీలించి మాట్లాడారు. రైతులు తాము సాగు చేసిన పంట పొలాల్లో ఎరువుల యాజమాన్యం, సస్యరక్షణ చర్యలు చేపట్టాలన్నారు. వరి పంటలో ఆకు ముడత, కాండం తొలుచు పురుగు ఆశించిందన్నారు. దీని నివారణకు క్లోరిపైరిపాస్ 500 మి.లీ. లేదా క్లోరంతో నిలిప్రోలు 60మి.లీ.లను 200 లీటర్ల నిటిలో కలిపి పిచికారి చేయాలన్నారు. వేరుశనగ సాగు చేసే రైతులు మేలైన విత్తనాలను ఎంపిక చేసుకోవాలన్నారు. వేరుశనగ పూత దశలో 200 కిలోల జిప్సంను ఏకరాకు వేయడం వలన అధిక దిగుబడి సాధించవచ్చన్నారు. సేంద్రీయ ఎరువులను వాడటం వలన సూక్ష్మ ధాతు లోపాలను నివారించవచ్చన్నారు. ప్రకృతి వ్యవసాయం చేస్తే తక్కువ ఖర్చుతో ఆరోగ్యకరమైన పంటలు పండించి అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. రైతులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

కడప అర్బన్: కడప నగరంలోని రిమ్స్ రోడ్డులో ఈ నెల 8వ తేదీన స్కూటర్‌ను మోటార్ సైకిల్ వెనుక వైపు నుంచి ఢీకొన్న ప్రమాదంలో గీత (40) అనే మహిళ తీవ్రంగా గాయపడింది. ఆమె ఓ ప్రైవేట్ హాస్పిటల్‌లో చికిత్సపొందుతూ శుక్రవారం మధ్యాహ్నం మృతి చెందారు. రిమ్స్ పోలీస్‌స్టేషన్ ఎస్ఐ సుభాష్ చంద్రబోస్ తెలిపిన వివరాల మేరకు ... కడప నగరంలోని ఊటుకూరుకు చెందిన సత్యకుమార్ నగర శివారులోని బసిరెడ్డి లా కళాశాలలో అధ్యాపకుడిగా పనిచేస్తున్నారు. ప్రతి రోజూ తన భర్త నిత్యకుమార్‌తో కలిసి లా కళాశాలకు వెళ్లేవారు. ఈక్రమంలో ఈనెల 8వ తేదీన కళాశాలకు తమ స్కూటర్‌లో వెళుతుండగా స్పిరిట్ కళాశాల సమీపంలోని మలుపు వద్దకు చేరుకోగానే వెనుకనుంచి మోటార్‌సైకిల్ ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన గీతను ప్రైవేట్ హాస్పిటల్‌లో చేర్పించారు. చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందిన గీతకు భర్తతో పాటు, ఇరువురు సంతానం వున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలియజేశారు.